
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 6 । జూన్ । 2023



డెల్టాలకు 4150 క్యూసెక్కులు

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 4,150 క్యూసెక్కుల నీరు వదిలారు. తూర్పు 1,100, సెంట్రల్ 50, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కులు వదిలారు.



భారీగా చదివింపులు

రాష్ట్ర ప్రభుత్వం విదేశాల్లో చదువుకునే వారికి ఆర్థిక తోడ్పాటును అందించేందుకు జగనన్న విద్యా దీవెన పథకం అమలు చేస్తోంది. అర్హులైన విద్యార్థులకు ట్యూషన్ ఫీజును పూర్తిగా ప్రభుత్వమే చెల్లించనుంది.

8లో

గరిష్టం/కనిష్టం
42.0°/25.5°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	42.0	25.5
కాకినాడ	39.0	26.8
అమలాపురం	39.5	27.4

న్యూస్‌రీల్

అర్జీలు సత్వరం పరిష్కరించాలి



స్పందనలో అర్జీ తీసుకుంటున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

అమలాపురం రూరల్: అర్జీదారుల సమస్యలపై సానుకూలంగా స్పందించి సత్వరమే సంతృప్తికర స్థాయిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ స్పందన హాల్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు 168 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్పందన కార్యక్రమం ద్వారా అర్జీల పరిష్కార సరళిని మెరుగు పరచాలని సూచించారు. నిర్దేశిత కాలవ్యవధిలో పరిష్కార మార్గాలు చూపాలని ఆదేశించారు. ప్రతి జిల్లా స్థాయి అధికారి తమ లాగిన్‌కు వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలన్నారు. అర్జీదారుని సంతృప్తి ధ్యేయంగా అర్జీలు పరిష్కరించాలన్నారు. ఒకసారి సమర్పించిన అర్జీ మళ్లీ రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముమ్మిడివరం మండలం పాశర్లపూడికి చెందిన కె.సత్యనారాయణ, పి.గన్నవరం మండలం ముంగండకి చెందిన పి.ఏడుకొండలుకు ట్రై సైకిళ్లు అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం.దుర్గారావు దొర, డీసీహెచ్ఎస్ పద్మశ్రీ రాణి, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, డ్వామా పీడీ ఎస్. మధుసూదన్, ఆర్ డబ్ల్యూఎస్ సీహెచ్ ఎన్వీ కృష్ణారెడ్డి, సీపీవో వెంకటేశ్వర్లు, జిల్లా గృహ నిర్మాణ సంస్థ ఇంజినీర్ సీహెచ్ బాబూరావు, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, ఐసీడీఎస్ జీవీ సత్యవాణి మార్కెటింగ్ శాఖ ఏడీ కె.విశాలాక్షి జలవనరుల శాఖ ఈఈ డీవీ రాంగోపాల్, డీపీఆర్ లక్ష్మీనారాయణ, ఏపీఈపీడీఎల్ ఈఈ రవి కుమార్ పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 26 వినతులు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక–స్పందన కార్యక్రమానికి 26 అర్జీలు వచ్చాయి. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ స్పందన కార్యక్రమం జరిగింది. అర్జీదారుల్లో కొందరు కుటుంబ సమేతంగా వచ్చి తమ కుటుంబ వివాదాలు, భూ తగాదాలను ఎస్పీకి వివరించి న్యాయం చేయాలని అభ్యర్థించారు. వచ్చిన అర్జీల్లో అధిక శాతం ఫిర్యాదులను ఎస్పీ శ్రీధర్ అక్కడికక్కడే పరిష్కరిస్తూ ఆయా పోలీసు స్టేషన్ల ఎస్సైలకు ఫోన్లు చేసి ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయ ఎస్పీ సీఐ కోలా రజనీకుమార్ పాల్గొన్నారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ కొనసాగింపునకు చర్యలు



కోనసీమ రైల్వే సాధన సమితి ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎంపీ అనురాధ

అల్లవరం: అమలాపురంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ కొనసాగించడానికి కేంద్ర రైల్వే మంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని కోనసీమ రైల్వే సాధన సమితి ప్రతినిధులకు ఎంపీ అనురాధ హామీ ఇచ్చారు. అమలాపురంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ని కొనసాగించాలని కోరుతూ కోనసీమ రైల్వే సాధన సమితి ప్రతినిధులు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, మట్టపర్తి మురళీకృష్ణ, మట్టపర్తి నాగేంద్ర, డాక్టర్ ఈఆర్ సుబ్రమణ్యం తదితరులు ఎంపీ అనురాధని సోమవారం ఆమె నివాసంలో కలసి విన్నవించారు. రైల్వే కౌంటర్లో ప్రతిరోజూ రూ.1 లక్ష ఆదాయం వస్తోందని, ఈ కౌంటర్ లో తీసుకొన్న టికెట్ల ద్వారా రోజూ 500 మంది ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అమలాపురం రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఎత్తివేసి రాజమహేంద్రవరం లేదా కాకినాడ వెళ్లే పరిస్థితి కల్పించడం వలన ప్రజలు చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. రెండేళ్లలో అమలాపురంలో రైల్వే స్టేషన్ వచ్చేంత వరకు రిజర్వేషన్ కౌంటర్‌ని కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ అనురాధ ఈ విషయాన్ని కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, మాట్లాడతానని హామీ ఇచ్చారు. రెడ్డి సత్యనారాయణ, వై. వెంకటేశ్వరరావు, ఎస్.నాగేశ్వరరావు ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రభుత్వం అండగా ఉంది

మేత, డీజిల్ ధరలు పెరిగిపోవడంతో ఆక్వా సాగు భారంగా మారింది. ప్రభుత్వం ఆక్వా సాగుకు రాయితీపై విద్యుత్ సరఫరా చేస్తూ రైతులను ప్రోత్సహించడం సంతోషంగా ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆక్వా పరిశ్రమకు ప్రభుత్వం అండగా ఉంది. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.310 కోట్లు విద్యుత్ రాయితీ ఆక్వా రైతులకు వచ్చేది. ప్రస్తుతం రూ.620 కోట్ల రాయితీగా ఏడాదికి వస్తోంది.

– త్సవటపల్లి నాగభూషణం, రామలింగేశ్వర ఆక్వా అసోసియేషన్ అధ్యక్షుడు

అప్సడాతో సమస్యల పరిష్కారం



ఆక్వా పరిశ్రమలో సమస్యల పరిష్కారానికి అప్సడా దోహద పడుతుంది. మధ్యవర్తులు లేకుండా ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలు తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు ఇది కృషి చేస్తుంది. ప్రభుత్వం యూనిట్ రూ.1.5 రాయితీతో ఆక్వా పరిశ్రమకు విద్యుత్ అందించి ప్రోత్సహించడం సంతోషం.

– భూపతిరాజు సుబ్రహ్మణ్యంరాజు, ఆక్వా రైతు, ఎదుర్లంక



రొయ్..రయ్

రొయ్యల చెరువులో ఆక్సిజన్ కోసం వినియోగిస్తున్న ఏరియేటర్

- ఆక్వా రంగాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- యూనిట్‌కు రూ.1.5 చొప్పున విద్యుత్ రాయితీ
- ఏటా రూ.620 కోట్ల మేర రైతులకు లబ్ధి
- టీడీపీ హయాంలో రూ.310 కోట్లకే పరిమితం

కాట్రేనికోన: ఆక్వా సాగు చేస్తున్న రైతులకు రాయితీపై విద్యుత్ అందిస్తూ ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. మేత, మందులు, డీజిల్ ధరల పెరుగుదలతో రొయ్యల సాగు రైతులకు భారంగా మారిన తరుణంలో ప్రభుత్వం రాయితీపై విద్యుత్ సరఫరా చేస్తూ చేయూతనిస్తోంది. ఆక్వా రైతుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చైర్మన్‌గాను, మత్స్యశాఖ మంత్రి సిదిరి అప్పలరాజు, వడ్డి రఘురామ్ వైస్ చైర్మన్‌లుగా ప్రభుత్వం అప్సడా – 2020 ఏర్పాటు చేసింది. ఆక్వా పరిశ్రమలో తలెత్తుతున్న సమస్యలు మధ్యవర్తులు లేకుండా సీఎం దృష్టికి తీసుకొని వెళ్లేందుకు, తక్షణ పరిష్కారానికి అప్సడా – 2020 దోహదపడుతుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని 16 మండలాల్లో సుమారు 14,061 హెక్టార్లలో చేపలు, రొయ్యల సాగు జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఆక్వా సాగుకు సంబంధించి విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఆక్వా జోన్ పరిధిలో ఉన్న 10 ఎకరాల లోపు చెరువులకు 5,600 కనెక్షన్లకు ప్రభుత్వం రాయితీపై విద్యుత్‌ను సరఫరా చేస్తుంది. అయితే 2,300 కనెక్షన్లకు సంబంధించి కమిటీ అప్రూవల్ చేసి కమిషనర్‌కు పంపించింది. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులను ప్రోత్సహిస్తూ సబ్సిడీపై విద్యుత్ సరఫరా చేయడంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ధరలు నిలకడగా ఉండేందుకు..

విద్యుత్ యూనిట్ ధర రూ.3.85కుగాను ప్రభుత్వం రాయితీపై రూ.1.5 అందిస్తోంది. వైట్ స్పాట్ వైరస్, వైట్‌గట్, ఈహెచ్‌పీ వంటి వ్యాధుల విజృంభణతో పాటు మేతలు, ఆయిల్ ధరల పెరుగుదల, నిలకడలేని రొయ్యల ధరలతో ఆక్వా రైతులు నష్టాల ఊబిలో చిక్కుకున్నారు. మేతల ధరలు, రొయ్యల ధరలు నిలకడగా ఉండేందుకు చర్యలు చేపట్టి రాయితీపై విద్యుత్ అందించడంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

హర్షం వ్యక్తం చేస్తున్న ఆక్వా రైతులు

రొయ్యలు ధరలకు సంబంధించి ఎక్స్‌పోర్టు కంపెనీలతో సంప్రదించి ప్రభుత్వం చేపట్టిన చర్యలు, రాయితీపై విద్యుత్ అందించడంపై ఆక్వా అసోసియేషన్ హర్షం వ్యక్తం చేస్తోంది.

పర్యావరణ పరిరక్షణకు సమష్టి కృషి



అమలాపురంలో పర్యావరణ ప్రతిజ్ఞ చేయిస్తున్న పొల్యూషన్ బోర్డు ఏఈ కరుణారేఖ, మున్సిపల్ కమిషనర్ నాయుడు తదితరులు

అమలాపురం టౌన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అమలాపురం మున్సిపాలిటీ, జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం ఉదయం చైతన్యవంతంగా ర్యాలీ జరిగింది. పొల్యూషన్ బోర్డు అసిస్టెంట్ ఇంజినీర్ కరుణారేఖ, మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో వార్డు సచివాలయాల కార్యదర్శులు, వలంటీర్లు, ఓఎన్‌జీసీ సిబ్బంది, విద్యార్థులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు అందరం సమష్టిగా నడుం బిగిద్దామని నినాదాలు చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎన్టీఆర్ మార్గ్, నల్లవంతెన మీదుగా కలెక్టరేట్ రోడ్డులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు వరకూ దాదాపు కిలోమీటరన్నర మేర సాగింది. ప్లాస్టిక్ వస్తువుల నివారణ, కాలుష్య నియంత్రణ వంటి నినాదాలతో ఉన్న ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. వాహనాల ద్వారా వచ్చే విపరీత కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రతీ వాహనదారుడు అప్రమత్తతో వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని పొల్యూషన్ బోర్డు అధికారిణి కరుణారేఖ స్పష్టం చేశారు. తడి పొడి చెత్త వర్గీకరణ ద్వారా ఇళ్ల వద్ద పర్యావరణ పరిరక్షణకు శ్రమించాలని మున్సిపల్ కమిషనర్ నాయుడు పిలుపునిచ్చారు. ర్యాలీ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలుకు చేరుకున్నాక ఆ హాలులో పర్యావరణ అవగాహన సదస్సు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు జరిగాయి. ర్యాలీలో పాల్గొన్న వారందరి చేత మున్సిపల్ కమిషనర్ నాయుడు పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్వో సీహెచ్ సత్తిబాబు ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొని పర్యావరణ పరిరక్షణలో ప్రతీ వ్యక్తి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. కిమ్స్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.స్వప్నకుమారి, ఈతకోట ఎస్‌పీఎల్ పరిశ్రమ అధినేత బీఎస్ రావు పాల్గొన్నారు.

మడ అడవుల పరిరక్షణ అందరి బాధ్యత



పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

కలెక్టర్ హిమాన్షు శుక్లా

కాట్రేనికోన: తీర ప్రాంత ప్రజలను ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షించడమే కాకుండా మత్స్యసంపద ఉత్పత్తికి దోహదపడుతున్న మడ అడవులను పరిరక్షించుకోవలసిన బాధ్యత మనందరిపైన ఉందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. కాట్రేనికోన మండలం కందికుప్ప అటవీ సెక్షన్ పరిధిలో సోమవారం అటవీశాఖ అధికారి ప్రసాదరావు అధ్యక్షతన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ హిత జీవనశైలి కార్యక్రమంలో కలెక్టరు హిమాన్షు శుక్లా, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచుర్ స్టేట్ డైరెక్టర్ ఫరీదా టెంపుల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా దేశవ్యాప్తంగా 72 ప్రాంతాలలో మడ అడవుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఢిల్లీ నుంచి ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో మడ అడవులలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో సుదీర్ఘ తీర ప్రాంతంతో పాటు మడ అడవులు అధికంగా ఉన్నాయని, వాటి పరిరక్షించుకోవలసిన బాధ్యత మనపై ఉందన్నారు. మడ అడవులు పరిరక్షణ, తీర ప్రాంత అభివృద్ధికి యూఎన్‌డీపీ రూ.4.5 కోట్లు, చమురు సంస్థల నుంచి సామాజిక బాధ్యతగా రూ.5 కోట్లు మంజూరు చేశారన్నారు. వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచుర్ స్టేట్ డైరెక్టర్ ఫరీదా టెంపుల్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం, చేపల వేటకు పనికి రాని వలలను సముద్రంలో వదిలేయడంతో కలుషితం అయిందన్నారు. సముద్ర జలాల్లోని మైక్రో ప్లాస్టిక్ వ్యర్థాలను మత్స్య సంపద ఆహారంగా తీసుకుంటుండగా వాటిని ఆహారంగా తీసుకోవడంతో మానవాళికి అనర్థం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలలో చిక్కుకున్న తాబేలు, మైక్రో ప్లాస్టిక్ వ్యర్థాలతో మత్స్యసంపద మృత్యువాత పడుతుందనే విషయం తెలిపే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, తుపానులు, సునామీల నుంచి తీర ప్రాంత ప్రజలకు మడ అడవులు రక్షణ కలిగిస్తున్నాయన్నారు. 1996 తుపానుకు తీరం వెంబడి చేపల వేట చేస్తున్న వందలాది మంది మత్స్యకారులు మృత్యువాత పడ్డారని, మడ అడవులతో తీర ప్రాంత గ్రామాలకు నష్టం పెద్దగా జరగలేదని గుర్తు చేశారు. హితకారిణి సమాజం చైర్మన్ కాశి మునికుమారి, జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, యేడిది చక్రపాణిరావు, నాతి అలివేణి, మల్లాడి ఏడుకొండలు పాల్గొన్నారు.

సీఎం సాయంతో భీమేశ్వరాలయ అభివృద్ధి



తవ్విన మట్టిని కూలీలకు ఎత్తుతున్న మంత్రి వేణు

మంత్రి వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో ప్రసిద్ధి చెందిన పంచారామ క్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వరాలయం అభివృద్ధికి బాటలు పడ్డాయని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మంత్రి వేణు సోమవారం ఆలయ ప్రాంగణంలోని సప్త గోదావరి అభివృద్ధి కోసం చేపట్టిన తవ్వకం పనులను పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలతో పాటు మంత్రి వేణు పలుగు తీసుకుని తవ్వకం చేసి మట్టిని కూలీలకు ఎత్తారు. భగవంతుని కోసం చేస్తున్న పని కాబట్టి శ్రద్ధగా చేయాలని ఈ సందర్భంగా కూలీలను కోరారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ సాక్షాత్తూ ఆ భీమేశ్వరుడే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా తన ఆలయ అభివృద్ధి కోసం తనను ఇక్కడకు రప్పించుకున్నారని భావిస్తున్నానన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో, పురావస్తు శాఖ అనుమతులతో ఆలయంలో అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. భక్తుల సహకారం, ప్రభుత్వ సహకారంతో సప్త గోదావరి కోనేరును ఎల్లప్పుడూ స్వచ్ఛమైన నీటితో ఉండేలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. అన్నదాన భవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు, దాత సత్తి సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ శాకా బాబీ, నాయకులు బాలాంతరం రాజు, రేవు శ్రీను, దత్తుడు పాల్గొన్నారు.

అతిసార నియంత్రణకు ప్రణాళిక

- వేసవిలో అప్రమత్తమైన వైద్య,ఆరోగ్య శాఖ
- జిల్లాలో మొదలైన నియంత్రణ పక్షోత్సవాలు



అల్లవరం మండలం డి.రావులపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో అతిసార నియంత్రణ పక్షోత్సవాలపై తల్లులు, పిల్లలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అమలాపురం టౌన్: ఓ పక్క మండే ఎండలతో వేసవి తాపం...మరోపక్క ఐదేళ్ల లోపు చిన్నారులు అతిసారం బారిన పడే అవకాశం ఉండడంతో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. జిల్లాలో ఐదేళ్ల లోపు ఉన్న 92,931 మంది పిల్లలను అతిసార నుంచి రక్షించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ఫోర్ట్‌నైట్ (ఐడీసీఎఫ్) కార్యక్రమం ద్వారా అతిసార నియంత్రణ పక్షోత్సవాలను ఈ నెల 5 నుంచి 17వ తేదీ వరకూ నిర్వహించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. కలెక్టరేట్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా, డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టీకే శ్రీనివాస్, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు తదితరులు సోమవారం ప్రారంభించారు. అతిసార నియంత్రణ పక్షోత్సవాల పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ పక్షోత్సవాల నిర్వహణలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖే కాకుండా శిశు సంక్షేమశాఖ, మంచినీటి సరఫరా శాఖ, విద్యా శాఖ, మున్సిపాలిటీలు, పంచాయతీరాజ్ జిల్లా శాఖల అధికారులు, సిబ్బంది భాగస్వామ్యం అవుతున్నారు.

ఇంటింటికీ వైద్య బృందాలు

ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఐదేళ్ల లోపు పిల్లలకు ఏఆర్ఎస్ (ఓరల్ రీ హైడ్రేషన్ సెల్యూషన్) ప్యాకెట్లు, అవసరమైన వారికి జింక్ ట్యాబెట్లు ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని 46 పీహెచ్‌సీలు, 432 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, 1,716 అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా ఏఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబెట్లు సిద్ధంగా ఉంచారు. జిల్లాలోని రెండు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రులు, 9 కమ్యూనిటీ ఆస్పత్రుల్లో కూడా పిల్లలకు అతిసార వ్యాధి వైద్యం అందించేందుకు సంబంధిత వైద్యులను సిద్ధంగా ఉంచారు. ఇదే సమయంలో ఏఎన్ఎంల ఆధ్వర్యంలో ఆయా ప్రాంత ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి పిల్లలు అతిసార బారిన పడకుండా ఆరోగ్య చిట్కాలు, జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు. ఏఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందజేస్తారు.

తల్లులకు ప్రత్యేక అవగాహన

వైద్య బృందాలు ఇంటింటికీ వెళ్లి ముఖ్యంగా ఆ ఇంట్లో ఉన్న ఐదేళ్ల లోపు పిల్లలకు అతిసారంపై జాగ్రత్తలు వివరిస్తూనే ఆ ఇళ్లలో ఉండే తల్లులకు వైద్య సిబ్బంది తల్లి పాల ఆవశ్యకత, చేతుల పరిశుభ్రత, ఇంట్లోనే ఓఆర్ఎస్ ద్రావణం తయారు చేసుకునే విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇదే సమయంలో రోటా వ్యాక్సిన్ తీసుకోని పిల్లలను గుర్తించి వారి తల్లులకు రోటా వ్యాక్సిన్‌పై అవగాహన కల్పిస్తున్నారు. పిల్లల్లో నీళ్ల విరేచనాలు రాకుండా నియంత్రించే రోటా వ్యాక్సిన్ ఐదేళ్ల లోపు పిల్లలందరూ విధిగా వేయించుకోవాలని సూచిస్తున్నారు.


సద్వినియోగం చేసుకోవాలి



ఐదేళ్లలోపు పిల్లల్లో అతిసార నియంత్రణకు నిర్వహిస్తున్న పక్షోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలి. వైద్య సిబ్బంది అందించే ఓఆర్ఎస్ ప్యాకెట్లతోనే కాకుండా ఇంట్లో స్వయంగా ఆ ఔషధ ద్రావణాన్ని తయారు చేసుకుని తమ పిల్లలకు అతిసార సోకకుండా కాపాడుకోవాలి. ఇంటింటికీ వచ్చే వైద్య సిబ్బంది చెప్పే సూచనలను పాటిస్తే అతిసార నుంచి పూర్తిగా బయటపడవచ్చు.

– ఎం.దుర్గారావు దొర, డీఎం అండ్ హెచ్‌వో

ఎమ్మెల్యేకు మత్స్యకారుల కృతజ్ఞతలు



ఎమ్మెల్యేపొన్నాడను కలిసిన మత్స్యకారులు పెమ్మాడి నారాయణరావు, మూదేఅన్నవరం

ఐ.పోలవరం: జీవనోపాధి నిమిత్తం వేట సాగిస్తూ పాకిస్తాన్ సముద్ర జలాల్లోకి వెళ్లి అక్కడి పోలీసులకు పట్టుబడ్డ మత్స్యకారులు ఐదేళ్ల తరువాత తిరిగి వచ్చి ఎమ్మెల్యే పొన్నాడను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని కొంతమంది మత్స్యకారులు ఐదేళ్ల క్రితం జీవనోపాధి కోసం వేటకు వెళ్లి గుజరాత్ రాష్ట్రం, వీరావలి ప్రాంతం పాకిస్తాన్, ఇండియా బోర్డర్‌లో పాకిస్తాన్ పోలీసులకు చిక్కారు. ఈ మత్స్యకారుల్లో ఐ.పోలవరం మండలం పశువులంక పంచాయతీకి చెందిన పెమ్మాడి నారాయణరావు, కాట్రేనికోన మండలం గచ్చకాయల పోర గ్రామానికి చెందిన మూదే అన్నవరం ఇటీవల స్వదేశానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తాము స్వదేశానికి తిరిగి రావడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేసినందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సంఘటనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేసిన రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అప్పనపల్లి దేవస్థానం ఈఓగా సాయిబాబు



మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారిగా డి.సాయిబాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాయిబాబు కృష్ణాజిల్లా ఎండోమెంట్స్ అధికారిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఏసీ, ఈఓగా పనిచేసిన డి.శ్రీరామవరప్రసాదరావు ఎన్టీఆర్ జిల్లా నెమలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ఈఓ, ఏసీగా బదిలీ అయ్యారు.

సీఎం పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు



చురుగ్గా సాగుతున్న మలికిపురం- విశ్వేశ్వరాయపురం రోడ్డు పనులు

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో ఈ నెల 7వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటిస్తున్నట్లు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ నెల 7వ తేదీన తన కుమారుడు రాపాక వెంకటరామ్ వివాహం మలికిపురం మండలంలోని కత్తిమండ గ్రామంలో తన నివాసం వద్ద జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్‌ను ఆహ్వానించినట్లు ఎమ్మెల్యే రాపాక అన్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో హెలీప్యాడ్ నిర్మాణంతో పాటు పలు రోడ్లను కూడా నిర్మిస్తున్నారు.

భారీగా చదివింపులు

- పేద విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యాదీవెన
- పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 21 కోర్సులకు అవకాశం



సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం

రాయవరం: పేద విద్యార్థుల సంక్షేమానికి పలు పథకాలను అందజేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విదేశాల్లో చదువుకునే వారికి ఆర్థిక తోడ్పాటును అందించేందుకు జగనన్న విద్యా దీవెన పథకం అమలు చేస్తోంది. విదేశాలకు వెళ్లి చదువుకునే అర్హులైన విద్యార్థులకు ట్యూషన్ ఫీజును పూర్తిగా ప్రభుత్వమే చెల్లించనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు అధికంగా రూ.1.25 కోట్లు, ఇతరులకు రూ.కోటి వరకు మంజూరు చేయనుంది. అర్హులైన విద్యార్థులకు పథకం అందించే క్రమంలో భాగంగా పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారు. జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి జిల్లా నోడల్ అధికారిగా సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ వ్యవహరిస్తున్నారు. పేద విద్యార్థులంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

టాప్ 50 యూనివర్సిటీల్లో చదివే అవకాశం

ప్రపంచవ్యాప్తంగా ఉన్న 379 యూనివర్సిటీ/ఇనిస్టిట్యూషన్లలో లేటెస్ట్ క్యూఎస్ రేటింగ్ ఆధారంగా టాప్ 50లో నిలిచిన యూనివర్సిటీ/ఇనిస్టిట్యూషన్లలో చదువుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, కాపు వర్గాలకు చెందిన పేద విద్యార్థులు పీజీ లేదా పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ కోర్సులు చదువుకునేందుకు ప్రభుత్వం ఆర్థికంగా తోడ్పాటునందిస్తోంది. ఆయా కోర్సులకు సంబంధించిన అవసరమైన విద్యార్హతల్లో కచ్చితంగా 60 శాతం మార్కులు పొందిన వారినే పరిగణలోకి తీసుకుంటారు. ఎంబీబీఎస్ అభ్యసించేందుకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తప్పనిసరిగా దేశ వ్యాప్తగా నిర్వహించే నీట్ ఎంట్రన్స్‌లో అర్హత సాధించాలి. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు హెచ్‌టీటీపీ://జ్ఞానభూమి.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వారి అర్హతల ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఈ కోర్సులకే అనుమతి

అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్, అగ్రికల్చర్ అండ్ ఫారెస్ట్రీ, ఆర్కిటెక్చర్ అండ్ బిల్ట్ ఎన్విరాన్‌మెంట్, ఆర్ట్ అండ్ డిజైన్, ఆర్ట్స్ అండ్ హ్యుమానిటీస్, బయోలాజికల్ సైన్స్, బిజినెస్, కెమిస్ట్రీ, కమ్యూనికేషన్ అండ్ మీడియా స్ట్రాటజీ, కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్ అండ్ ఎకనామెట్రిక్స్, ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, ఇంజినీరింగ్, ఇంజినీరింగ్ మినరల్స్ అండ్ మైనింగ్, ఇంజినీరింగ్-పెట్రోలియం, హాస్పిటాలిటీ అండ్ లీజర్ మేనేజ్‌మెంట్, లా, మెడిసిన్, నేచురల్ సైన్స్, ఫిజిక్స్ అండ్ ఆస్ట్రానమీ.

జూన్ 10 వరకు గడువు



జగనన్న విదేశీ విద్యాదీవెనకు అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 10 వరకు దరఖాస్తుకు గడువు ఉంది. కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.8లక్షలకు మించకుండా 35 ఏళ్ల వయసులోపు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉన్నత చదువులు చదువుకోవాలనే పేద విద్యార్థులకు ఈ పథకం ఒక వరం లాంటిది.

– డి.వి.రమణమూర్తి, జాయింట్ డైరెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ, కాకినాడ

దివ్యాంగులకు పరికరాల అందజేత



దివ్యాంగులకు చంక కర్రలు, చేతికర్రలు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని దివ్యాంగులకు ఆశ్రయ జిల్లా వికలాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఉచితంగా చంక కర్రలు, చేతి కర్రలు, సైలెంట్ వాకర్స్‌లను కలెక్టర్ కృతికా శుక్లా సోమవారం పంపిణీ చేశారు. దివ్యాంగులకు అవసరమైన పరికరాలను ఆశ్రయ వికలాంగుల సమాఖ్య సమకూర్చడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆశ్రయ జిల్లా వికలాంగుల సమాఖ్య అధ్యక్షుడు సురేష్ మాట్లాతూ ముగ్గురు ఐఐటీ చేసిన యువకులు ప్లేక్సీమో అనే కంపెనీని స్థాపించి వినూత్న పద్ధతిలో దివ్యాంగులకు అవసరమైన పరికరాలు తయారు చేస్తున్నారన్నారు. వాయిస్ ఆఫ డిసేబిలిటీ సంస్థ సీఎస్ఆర్ సహకారంతో జిల్లాలో ఉన్న అందరికీ దివ్యాంగులకు అందజేయాలి అనేది ఆశయమన్నారు. మంగళవారం తూరంగి అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో ఉన్న ఆశ్రయ జిల్లా వికలాంగుల సమాఖ్య సంస్థ కార్యాలయంలో మిగిలిన వారికి పరికరాలను ఉచితంగా అందిస్తామన్నారు. దివ్యాంగులకు అవసరమైతే తమ సంస్థను సంప్రదిస్తే కొలతలు తీసుకొని ఉచితంగా అందజేస్తామని సురేష్ వివరించారు. ఈ సంవత్సరంలో 100 మందికి ఈ పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు.

శిక్షణతో పరిపాలనపై అవగాహన

ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్



జెడ్పీటీసీ సభ్యులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: జెడ్పీటీసీ సభ్యులకు ఇస్తున్న శిక్షణతో వారికి పరిపాలనపై అవగాహన పెరుగుతుందని విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటీసీ) ప్రిన్సిపాల్, డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరిసీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులకు మూడు రోజుల శిక్షణలో భాగంగా రెండవ బ్యాచ్‌కు సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి జిల్లా వరకు మూడంచెల విధానంలో ఆయా సమావేశాల్లో పాల్గొనే హక్కు, అధికారం జెడ్పీటీసీ సభ్యులకు ఉంటుందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుకు దూసుకుపోవడం ద్వారా మంచి ప్రజా ప్రతినిధులుగా గుర్తింపు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇందుకు అవసరమైన సలహాలు, సూచనలు శిక్షణలో ఇస్తామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఈ కృష్ణమోహన్ మాట్లాడుతూ జెడ్పీటీసీ సభ్యుల హక్కులు, బాధ్యతలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈటీసీ ఫ్యాకల్టీలు శ్రీదేవి, ఎంఎస్ఎన్‌రెడ్డి, నిహారిక, ప్రసాద్ పంచాయతీరాజ్ చట్టం, జిల్లా ప్రజాపరిషత్తుల ఏర్పాటు, సభ్యుల ఎంపిక, పదవీ కాలం, రాజీనామా, జిల్లా ప్రజాపరిషత్తు చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల విధులు, అధికారాలు, బాధ్యతలు, స్థాయీ సంఘాల ఏర్పాటు, సమావేశాల నిర్వహణ, చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానం, జిల్లా పరిషత్తు బడ్జెట్ అంశాలపై మొదటి రోజు శిక్షణ నిర్వహించారు.

జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ హెచ్‌ఓడీగా నాగకుమార్



అనపర్తి: జాతీయ స్థాయిలో నిర్వహించే స్కూల్ గేమ్స్‌లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించే ఐదు క్రీడాంశాల నిర్వహణకు హెచ్ ఆఫ్ డెలికేషన్ హెచ్‌ఓడీగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి, స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ పీడీ ఆర్.నాగకుమార్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం నల్లమిల్లి సత్తిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 66వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ఈ నెల 6 నుంచి 12 వరకు ఢిల్లీలో జరగనున్నాయని చెప్పారు. 13 క్రీడాంశాల్లో జరిగే ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించే షూటింగ్, చదరంగం, యోగాసన, వెయిట్ లిఫ్టింగ్, టైక్వాండో ఐదు క్రీడాంశాలకు సంబంధించి హెచ్‌ఓడీగా నాగకుమార్ వ్యవహరించనున్నట్లు తెలిపారు.

అదిరిన 'సన్నాయి పాట'



వేలం నిర్వహిస్తున్న దేవస్థానం ఏసీ రమేష్ బాబు, ట్రస్టీ ధళే సూర్యనారాయణ, అధికారులు

- రత్నగిరిపై మార్మోగిన సన్నాయి మేళం లైసెన్స్ వేలం
- నెలకు రూ.18,00,116కు టెండర్ ఖరారు
- ఏడాదికి రూ. 2.16 కోట్ల ఆదాయం

అన్నవరం: స్థానిక శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో జరిగే వివాహాలు, ఉపనయనాలు, ఇతర శుభకార్యక్రమాలలో వాయించే సన్నాయి మేళం లైసెన్స్‌కు సోమవారం టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించగా రికార్డు స్థాయిలో వేలం ఖరారైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా నెలకు రూ.18,00,116కు టెండర్ ఖరారైంది. రెండేళ్ల కాలపరిమితికి గాను ఈ వేలం కం టెండర్ నిర్వహించారు. ఖరారైన టెండర్ ద్వారా మొదటి సంవత్సరం రూ.2.16 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉండగా, రెండో సంవత్సరం ఈ మొత్తంపై పది శాతం అదనంగా పాటదారుడు చెల్లించాల్సి ఉంటుంది. అంటే రెండు సంవత్సరాలకు కలిపి రూ.4.54 కోట్ల ఆదాయం రానుంది. ఖరారైన టెండర్ మొత్తంపై 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది.
తొలుత వేలంపాట నిర్వహించగా నెలకు రూ.11 లక్షల వరకు పాట వెళ్లింది. అదే అత్యధిక మొత్తంగా అధికారులు భావించారు. ఆ తరువాత టెండర్ బాక్స్ ఓపెన్ చేయగా నెలకు రూ.18,00,116కు టెండర్ కోట్ చేయడంతో దానిని ఖరారు చేశారు.

దేవస్థానంలో అత్యధిక వేలం పాట ఇది

అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని అన్ని వ్యాపారాలలో అత్యధిక మొత్తంలో ఖరారైన వేలం పాట ఇది. ఇంత మొత్తంలో వేలం ఖరారవుతుందని దేవస్థానం వర్గాలు కూడా ఊహించలేదు. సాధారణంగా దేవస్థానంలో భక్తులు మొక్కు చెల్లించిన తలనీలాలు (జుత్తు) వేలం పాట రూ. కోట్లలో ఖరారవుతుంటుంది. రెండు, మూడేళ్లుగా తల నీలాల వేలం పాట కూడా రూ.రెండు కోట్లు దాటలేదు. ఎనిమిదేళ్ల క్రితం ఇదేవిధంగా వేలం నిర్వహించగా మొదటి సారి ఏడాదికి రూ. పది లక్షలు, రెండో సారి ఏడాదికి రూ.రూ.55 లక్షలకు వేలం పాట వెళ్లింది. ఇప్పుడు ఏకంగా ఏడాదికి రూ.2.16 కోట్లకు ఖరారైంది. దేవదాయశాఖ కమిషనర్ అనుమతి తీసుకుని పాటదారునికి లైసెన్స్ మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు, ఏఈఓ జగ్గారావు, సూపరింటెండెంట్‌లు కంచి మూర్తి, కాపారపు శివ తదితరులు ఈ వేలం నిర్వహించారు. దేవస్థానం ట్రస్టీ ధళే వీర సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కన్నతల్లిపై కొడుకు దాడి

తుని: కనిపెంచిన మాతృమూర్తిపై దాడి చేసిన ఘటనపై తుని పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ కె.సూరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుని రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్న టీడీపీ నాయకుడు శిల్పరశెట్టి జగన్మోహన్ తన తల్లి నూకరత్నంపై సోమవారం కర్రతో దాడి చేసి గాయపరిచాడు. ఇదే ప్రాంతంలో నివాసం ఉంటున్న నూకరత్నం డ్వాక్రా సంఘంలో సభ్యురాలు. గ్రూపు సభ్యుల్లో తనకు వచ్చిన రూ.50 వేలు నగదును కొడుకు జగన్మోహన్‌కు గతంలో ఇచ్చింది. తనకు సొమ్ము అవసరం ఉందని కొడుకును ఇంటికి వెళ్లి అడిగింది. దీంతో జగన్మోహన్ దురుసుగా గెంటి వేసి తర్వాత కర్రతో దాడి చేయడంతో నూకరత్నం గాయపడింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ సూరిబాబు తెలిపారు.

మూడున్నరేళ్ల బాలికపై కామాంధుడి దారుణం

ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

కాకినాడ రూరల్: కాకినాడ ముత్తానగర్‌లో కుటుంబంలోని మూడేళ్ల చిన్నారిపై సమీపంలోని నివాసం ఉంటున్న కామాంధుడు దారుణానికి ఒడిగట్టాడు. ఇంట్లో ఉన్న చిన్నారిపై 48 ఏళ్ల రామకృష్ణ అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో తల్లిదండ్రులు గమనించి ఆందోళన వ్యక్తం చేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. బాధిత చిన్నారి తల్లి వెంటనే పోలీసులను ఆశ్రయించడంతో ఇంద్రపాలెం ఏఎస్సై రాంబాబు నిందితుడిపై పోక్సో, అత్యాచార చట్టం కింద కేసు నమోదు చేశారు. పోక్సో కేసు దిశ స్టేషన్ పరిధిలోకి రావడంతో కేసును దిశ స్టేషన్‌కు బదలాయించారు. దిశ డీఎస్పీ కేసు విచారణ చేపట్టనున్నట్టు ఇంద్రపాలెం పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ ఏటిమొగకు చెందిన మత్స్యకార కుటుంబం ముత్తానగర్‌లో కాపురం ఉంటుండగా అదే మత్స్యకార కుటుంబానికి చెందిన రామకృష్ణ కుటుంబం కూడా పక్కనే నివాసం ఉంటోందన్నారు. చిన్నారిని అప్పుడప్పుడూ ఆడిస్తూ ఉంటాడు. ఈ నేపథ్యంలో చిన్నారిని ఆడిస్తూ తన ఇంట్లోకి తీసుకువెళ్లాడు. ఆ సమయంలో రామకృష్ణ భార్య బయట పనిచేసుకుంటుందని, ఈ సమయంలోనే 48 ఏళ్ళ రామకృష్ణ అఘాయిత్యానికి పాల్పడ్డాడని చెప్పారు. నిందితుడిని కఠినంగా శిక్షించేలా కేసు నమోదు చేశామని, బాలికలను ప్రభుత్వాస్పత్రికి వైద్య పరీక్షల నిమిత్తం పంపించామన్నారు.

నేడు ఐటీఐ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

రాయవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మొదటి విడత ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్నవారు తమ సర్టిఫికెట్లను మంగళవారం సాయంత్రం 5 గంటల లోపు వెరిఫికేషన్ చేయించుకోవాలి. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ జిల్లా కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఐటీఐ ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కాకినాడ లేదా జగ్గంపేటలోని ప్రభుత్వ ఐటీఐల్లో ఏదో ఒకచోట తమ సర్టిఫికెట్లు వెరిఫై చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ సమయంలో ఆన్‌లైన్ నమోదు పత్రం, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు చూపించాలని తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోని వారు అడ్మిషన్‌కు అనర్హులని స్పష్టం చేశారు.